సాక్షి ఖమ్మం
ఆదివారం । 7 । జనవరి । 2024



జిల్లా ఓటర్లు 12,16,832

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఐదు నియోజకవర్గాల్లో 12,16,832 మంది ఓటర్లు ఉన్నారు. 8లో



దేశం గర్వించేలా తీర్చిదిద్దాలి

కిన్నెరసానిలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలు ముగియగా ఎమ్మెల్యే కూనంనేని బహుమతులు అందజేశారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 17°

ఆదివారం జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్ రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాజ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలతో పాటు సాంఘిక, గిరిజన సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించారు. 2024–25 విద్యాసంవత్సరం ఐదో తరగతి ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బీసీ గురుకులాల ఆర్‌సీఓ టి.అంజలి తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి http://tgcet. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వసతిగృహాల విద్యార్థులకు గైడ్లు



విద్యార్థులకు గైడ్లు అందజేస్తున్న సంక్షేమాధికారి

నేలకొండపల్లి: జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు మెరుగైన జీపీఏ సాధించేలా అవసరమైన స్టడీ మెటీరియల్ సమకూరుస్తున్నారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా నిపుణులు రూపొందించిన ఆల్ ఇన్ వన్ గైడ్లను జిల్లాలోని 22 వసతి గృహాల్లో ఉన్న 521 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. వీటిని పంపిణీ శనివారం మొదలుకాగా, నేలకొండపల్లి మండలం చెరువుమాదారం వసతిగృహంలో విద్యార్థులకు సంక్షేమాధికారి ఓదెలు శనివారం అందజేశారు. ఆంగ్లం, హిందీ, గణితం, సైన్స్ పాఠాలు సులభంగా అర్థమయ్యేలా, విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా వీటిని రూపొందించినట్లు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- ఎంఎస్‌ఎంఈ వైస్ చైర్మన్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

సత్తుపల్లి: ప్రధాని నరేంద్రమోదీ మేకిన్ ఇండియా ఆలోచనలకు అనుగుణంగా గ్రామీణ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ(ఎంఎస్‌ఎంఈ) పనిచేస్తుందని రాష్ట్ర వైస్ చైర్మన్ పెద్దింటి సూర్యనారాయణ వెల్లడించారు. సత్తుపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణరాణే నేతృత్వాన యువతకు ఉపాధి కల్పించేలా ఎంఎస్‌ఎంఈలను పటిష్టం చేస్తున్నామన్నారు. ఐదు నుంచి 12 మంది బృందంగా ఏర్పడి పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తే రుణ సౌకర్యం అందుతుందని తెలిపారు. పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు, యంత్రాలను సంస్థ సమకూరుస్తుందని చెప్పారు. ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించేందుకు 200 కంపెనీలతో ఒప్పందం జరిగిందని తెలిపారు. కాగా, తనకు ఎంఎస్‌ఎంఈ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర చైర్మన్ బి.వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ వైస్ చైర్మన్ హరీష్ పాల్గొన్నారు.

వెల్లువెత్తాయి..

- జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు 5,49,852
- నానాటికీ పెరుగుతూ వచ్చిన వైనం
- గృహలక్ష్మి, ఇంటి నిర్మాణ సాయం కోసమే పలువురి విన్నపం
- ఆన్‌లైన్‌లో మొదలైన నమోదు ప్రక్రియ



ఖమ్మం మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు (ఫైల్)



చింతకానిలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా గ్యారంటీల అమలుకోసం దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించి ప్రజాపాలన పేరిట గ్రామ, వార్డుసభలు నిర్వహించింది. గ్రామపంచాయతీల్లో వార్డులు, మున్సిపాలిటీల్లో డివిజన్ల వారీగా నిర్వహించిన ఈ సభలు గత నెల 28న మొదలై శనివారం ముగిశాయి. ఈమేరకు జిల్లాలో 5,49,852 దరఖాస్తులు అందినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో 4,71,425 కుటుంబాల నుంచి గ్యారంటీల కోసం 4,88,316 దరఖాస్తులు అందగా.. ఇతర సమస్యలపై 61,536 దరఖాస్తులు అందాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

డిప్యూటీ సీఎం సహా మంత్రులు

గతనెల 28న ప్రజాపాలన సభలు మొదలయ్యాయి. షెడ్యూల్ వారీగా జిల్లాలోని 21 మండలాల్లో ఉన్న 589 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 125వార్డుల్లో కలిపి మొత్తంగా 714 ప్రాంతాల్లో సభలు నిర్వహించి 'అభయహస్తం' పేరిట దరఖాస్తులు స్వీకరించారు. ఒక్కో వార్డు, డివిజన్‌లో నిర్ణీత తేదీల్లో దరఖాస్తులు స్వీకరించడమే కాక ఆతర్వాత కూడా మరికొద్ది రోజులు శిబిరాలు కొనసాగించారు. అలాగే, కార్యాలయాల్లోనూ శనివారం వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. కాగా, సభలకు మంచి స్పందన లభించగా ప్రజలు వెల్లువలా దరఖాస్తులు అందజేశారు. ఈమేరకు ఎంత మంది వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు సైతం ఏర్పాటుచేశారు. జిల్లాలోని పలు సభలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని భరోసా కల్పించారు.

ముగిసిన 'ప్రజాపాలన'

ఎర్రుపాలెం/మధిరరూరల్: ప్రజాపాలన సభలు జిల్లాలో సజావుగా ముగిశాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎర్రుపాలెం, మధిర మండలాల్లో సభలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు ఆరా తీయడమే కాక అధికారులకు సూచనలు చేశారు. అలాగే, బనిగండ్లపాడు సభకు డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టి విక్రమార్కతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.

ఎక్కువగా వాటికే...

అభయహస్తం ద్వారా మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. అయితే, జిల్లాలో ఎక్కువగా మహాలక్ష్మి ద్వారా మహిళలకు నెలనెలా ఆర్థిక సాయం, రూ.500కే సిలిండర్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

జిల్లాలో నిర్వహించిన సభలు అందిన దరఖాస్తులు

తేదీ	సభలు	దరఖాస్తులు
డిసెంబర్ 28	100	29,306
29	110	42,550
30	92	59,977
జనవరి 2	105	76,681
3	97	78,793
4	80	71,984
5	77	75,641
6	53	1,14,920
మొత్తం	714	5,49,852

ఆన్‌లైన్‌లో నమోదు

జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ శనివారం మొదలుపెట్టారు. మండలాల వారీగా ఎక్కడికక్కడ డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఎప్పటి నుంచి అమలవుతాయనేది స్పష్టత లేకున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఈ పథకాలకే కాక భవిష్యత్‌లో అమలుచేసే పథకాల కోసం కూడా ప్రభుత్వం వద్ద వివరాలు ఉండనున్నాయి. కాగా, ఆన్‌లైన్ ప్రక్రియకు 17వ తేదీ వరకు గడువు ఉన్నా సంక్రాంతి లోగానే పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ రూపొందించారు.

ఇంటికోసం దరఖాస్తు ఇచ్చా...



ఒంటరి మహిళనైనా నాకు ఇంటి జాగా ఉంది. కానీ ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. మా గ్రామంలో సభ పెట్టారని తెలిసి ఇంటి నిర్మాణానికి సాయం కోసం దరఖాస్తు ఇచ్చా. మా గ్రామానికే వచ్చి దరఖాస్తులు స్వీకరించడం బాగుంది. ఒక రోజు ముందే దరఖాస్తు ఇచ్చారు.

– టీకుమల్ల సంగమ్మ, మల్లేపల్లి, రఘునాథపాలెం మండలం

విద్యుత్ రాయితీ, ఇంటి కోసం



ఒకరోజు ముందే ఇంటికి వచ్చి దరఖాస్తు ఇచ్చారు. దరఖాస్తు నింపడంలో కూడా ఉద్యోగులు సాయం చేశారు. ఉచిత విద్యుత్‌తో పాటు ఇంటి నిర్మాణానికి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నా. అన్ని పథకాలకు కలిపి గ్రామంలోనే దరఖాస్తు తీసుకోవడం ఆనందంగా ఉంది.

– తేజావత్ సతీష్, మల్లేపల్లి, రఘునాథపాలెం మండలం

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా..



సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన ఎమ్మెల్యే రాందాస్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, నాయకులు

- మధిర ప్రజలు తలెత్తుకునేలా పాలన చేస్తా
- నాకు రాజకీయ జన్మనిచ్చిన ఈ గడ్డ అభివృద్ధికి కృషి
- పౌర సన్మాన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్క - నందిని దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మధిర: అధికారంతో విర్ర వీగకుండా వెన్నులో భయం పెట్టుకుని మరీ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు సేవకుడిగా పనిచేసి అప్పుల రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు నిరంతరం శ్రమిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిరలో శనివారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమానికి తన సతీమణి నందినితో కలిసి భట్టి హాజరయ్యారు. తొలుత ఆయనకు మధిరలోని అంబేద్కర్ సెంటర్ వద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్సార్ చౌరస్తా వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆతర్వాత ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్న భట్టి దంపతులను కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖలను సమర్థవంతంగా నిర్వర్తించి మధిర ప్రజలు తలెత్తుకునేలా పాలన సాగిస్తానని తెలిపారు. పదేళ్ల తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేయగా... అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు అహర్నిశలు పాటుపడతానని చెప్పారు. బీఆర్‌ఎస్ నిర్వాకంతో రూ.1.10 లక్షల కోట్ల రుణాలతో ఉన్న విద్యుత్ రంగాన్ని కాపాడుతూనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నన్నాయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు రెండో తేదీన వేతనాలు ఇచ్చామని చెప్పారు. పక్కా ప్రణాళికలతో సంపద సృష్టించి, ఆ సంపదను ప్రజలకు పంచడమే ఆరు గ్యారంటీల అమలు లక్ష్యమని భట్టి వివరించారు. కాగా, తాము అధికారంలోకి వచ్చినెల కాకముందే హామీల అమలుపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు వారి హయాంలో ఎన్ని హామీలు విస్మరించారో గుర్తుచేసుకోవాలని భట్టి హితవు పలికారు.

మధిర అంటే ప్రాణం

రాజకీయంగా తనకు జన్మనిచ్చిన మధిర నియోజకవర్గమంటే ప్రాణమని, ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని భట్టి వెల్లడించారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్‌మార్చ్ పేరిట చేసిన పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించిందని, మధిర ప్రజలు ఇచ్చిన శక్తి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి ఉపయోగపడిందని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ పాలనలో ఒత్తిళ్లు, వేధింపులకు లొంగకుండా పదేళ్లు కడుపులో పెట్టి కాపాడిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని భట్టి విక్రమార్క వెల్లడించారు. అనంతరం మధిర బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతులు భట్టిని ఘనంగా సన్మానించగా వాసు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని పరిశీలిస్తే భట్టి ముందు, భట్టి తర్వాత అని భవిష్యత్ తరాలు చెప్పుకుంటాయని చెప్పారు. ఈ సభలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, డాక్టర్ కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోనా ధనికుమార్, రంగా హన్మంతరావు, రంగా శ్రీనివాసరావు, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, చిలువేరు బుచ్చిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే మోడల్‌గా 'ఇందిరమ్మ' డెయిరీ

ఎర్రుపాలెం: దేశంలోనే మోడల్‌గా నిలిచేలా ఇందిరమ్మ డెయిరీ పరిశ్రమను మధిర నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎర్రుపాలెం మండలంలోని మామునూరులోని పేట చెరువు వద్ద శనివారం జిల్లాస్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కూడా పాల్గొనగా.. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటైతే ఇక్కడి మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని తెలిపారు. ఆతర్వాత మిషన్ భగీరథ, జలవనరుల శాఖాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన డిప్యూటీ సీఎం, కట్లేరు కాల్వల ఆధునికీకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాస్, ఎస్‌ఈ సదాశివకుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఆనంద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, ఆర్డీఓ గణేష్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్‌లు మారాబత్తుల మోహన్‌రావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగా పుల్లారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కాగా, మామునూరులో కాంగ్రెస్ నాయకులు, నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 276 ప్రత్యేక బస్సులు..



ఖమ్మం మామిళ్లగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల నుంచి 276 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రీజియన్‌లోని ఖమ్మం డిపో నుండి 66బస్సులు, మధిర నుండి 38, సత్తుపల్లి నుండి 55, భద్రాచలం నుండి 45, కొత్తగూడెం నుండి 33, మణుగూరు నుండి 23, ఇల్లెందు డిపో నుంచి 16బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. మహాలక్ష్మి పథకం నేపథ్యాన రద్దీ ఉండే అవకాశమున్నందున ప్రయాణికులు తమ ప్రయాణాలపై కార్యాచరణ రూపొందించుకోవాలని ఆర్‌ఎం కోరారు. అయితే, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఎంలను ఆదేశించిన ఆర్‌ఎం.. రద్దీ వేళల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సాయం తీసుకోవాలని తెలిపారు. కాగా, అదనపు సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే ఉంటాయని, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్‌ఎం వెల్లడించారు.

రామయ్యకు రాజఖడ్గం సమర్పణ



రాజఖడ్గాన్ని ప్రదర్శిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి ఉత్తరాది పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మధ్వాచార్య మూల మహాసంస్థానం వారు రాజఖడ్గం, డాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకులు వాటికి ప్రత్యేక పూజలు చేశారు. బంగారు పూత ఖడ్గంతో పాటు బంగారు, రాగి పూతగల డాలు అందజేశారు. వీటి విలువ రూ.3.10 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక శనివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశాక.. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆయల పరిసరాలు సందడిగా మారాయి.

వార్మర్ల కొరత.. పిల్లలపై బెంగ

- ఎస్‌ఎన్‌సీయూలో ఎక్కువ మందికి చికిత్స అందించాలంటే ఇక్కట్లు
- ఒక్కో వార్మర్‌లో ఇద్దరు, ముగ్గురికి వైద్యం
- 20 వార్మర్లే ఉండటంతో తరచుగా సమస్యలు
- సంఖ్య రెట్టింపు చేస్తేనే సమస్యకు పరిష్కారం



ఎస్‌ఎన్‌సీయూలోని వార్మర్లలో చికిత్స పొందుతున్న నవజాత శిశువులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐదేళ్ల క్రితం మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)ను ఏర్పాటు చేశారు. ఇక్కడ గర్భిణులు, బాలింతలు, మహిళలతోపాటు నవజాత శిశువులు, చిన్నారులకు వైద్య సేవలు అందిస్తుంటారు. అనారోగ్య సమస్యలతో పుట్టే నవజాత శిశువుల కోసం ఎస్‌ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్) కూడా ఉంది. యూనిట్‌లో నవజాత శిశువులకు వైద్యం అందించేందుకు కావాల్సిన వార్మర్లు సరిపడా లేక సేవల్లో అవాంతరాలు తలెత్తుతున్నాయి. ఎస్‌ఎన్‌సీయూలో ఇరవై వార్మర్లే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎన్‌సీయూ సేవలు ప్రభుత్వ పరంగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోనే కొనసాగుతున్నాయి. ఇక్కడి ఎంసీహెచ్‌లో నిత్యం 25 నుండి 30 వరకు ప్రసవాలు జరుగుతుండగా.. ఇరవై వార్మర్లను పది ఎంసీహెచ్‌లో అనారోగ్య సమస్యలతో పుట్టే వారికి, మరో పది బయట నుండి వచ్చే శిశువులకు వినియోగిస్తున్నారు. అంతకు మించి శిశువులను తీసుకొస్తే అవి సరిపోవడంతో లేదు. తరచుగా ఒక్కో వార్మర్‌లో ఇద్దరు, ముగ్గురిని ఉంచి చికిత్స చేయాల్సి వస్తోంది.

జిల్లా నలుమూల నుండి ఇక్కడికే

నవజాత శిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్‌ఎన్‌సీయూ సేవలు ఆశించిన మేరకు ఫలితం ఇవ్వట్లేదు. శిశువులను వార్మర్లలో ఉంచి చికిత్స అందిస్తేనే వారి ఆరోగ్యం కుదుటపడుతుంది. శిశువులకు తల్లి గర్భంలో మాదిరి వెచ్చదనాన్ని అందిస్తూ చికిత్స అందించడానికి వార్మర్లు వినియోగిస్తారు. కానీ ఎస్‌ఎన్‌సీయూలో ఇరవై వార్మర్లే ఉండటంతో సరిపోవట్లేదు. అంతే కాకుండా జిల్లా నలుమూల నుండి ఇక్కడికే శిశువులను తీసుకువస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా అంతటికి ప్రభుత్వపరంగా ఖమ్మం ఆస్పత్రే దిక్కు కావడంతో భారం పడుతోంది. ప్రస్తుతం పెద్దాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూకు ప్రతీరోజు 50 మంది వరకు చిన్నారులను తీసుకొస్తుండడంతో ఒక్కోదానిపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి చికిత్స అందించాల్సి వస్తోంది. సీజనల్ వ్యాధుల సమయాన ఈ ఇక్కట్లు మరింత పెరుగుతున్నాయి.

ప్రైవేట్‌లో భారీగా దోపిడీ

తక్కువ బరువు, నెలలు నిండకుండా పుట్టిన వారే కాక పుట్టగానే హైపోథెర్మియా, ఇతర సమస్యలతో బాధపడే శిశువులను వార్మర్లలో పెట్టి చికిత్స చేస్తారు. వీటిలో శిశువులకు ఆక్సీజన్‌తో పాటు ఐసోలేషన్ సేవలు అందుతాయి. కానీ ప్రభుత్వ పరంగా ఒక్కటే ఎస్‌ఎన్‌సీయూ ఉండగా... ఇక్కడ రద్దీ కారణంగా పలువురు ప్రైవేట్ ఆస్పత్రులకు ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకి రూ.8వేల నుండి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో నిరుపేదలైతే చేసేదేం లేక ఇంటికి తీసుకెళ్తుండగా శిశువులు మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా ఆస్పత్రిలో వార్మర్ల సంఖ్య పెంచడమే కాక ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఎస్‌ఎన్‌సీయూ సెంటర్లు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్సలో ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ఇక్కడకు తీసుకొచ్చే నవజాత శిశువుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఒక్కో సమయంలో ఇబ్బంది తలెత్తున్న మాట వాస్తవమే. కానీ ఇప్పటి వరకైతే వార్మర్లు సరిపోతున్నాయి. అయినా మరికొన్ని సమకూర్చాలని ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతానికైతే ఇబ్బంది తతెత్తకుండా చికిత్స అందిస్తున్నాం. వార్మర్లు మరిన్ని వస్తే మరికొందరికి చికిత్స చేయొచ్చు.

– డాక్టర్ బాబు రత్నాకర్, పెద్దాసుపత్రి, పీడియాట్రీషన్ హెచ్‌ఓడీ

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన సీపీ సునీల్‌దత్



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సునీల్‌దత్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో శనివారం డిప్యూటీ సీఎంను కలిసిన సీపీ పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ప్రారంభం



క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

కూసుమంచి: పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ అధికారిక క్యాంపు కార్యాలయాన్ని కూసుమంచిలో కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ ప్రజలు ఈ కార్యాలయం ద్వారా సమస్యలను చెప్పుకోవచ్చని, మంత్రి పొంగులేటి ఆధ్వర్యాన పరిష్కారానికి కృషి జరుగుతుందని తెలిపారు. ఎంపీపీలు బోడ మంగీలాల్, వజ్జా రమ్య, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రామసహాయం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



చేబ్రోలు చైత్ర, చెన్నకేశవ, మూడ్ హర్షశ్రీ

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీమన్నారాయణ తెలిపారు. పాఠశాలకు చెందిన చేబ్రోలు చైత్ర అండర్–17 విభాగంలో బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరగనున్న టోర్నీలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనుందని పేర్కొన్నారు. అలాగే, చేబ్రోలు చెన్నకేశవ బాలుర విభాగంలో, మూడ్ హర్షశ్రీ బాలికల విభాగంలో కర్ణాటకలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆదర్శ్‌కుమార్, పీఈటీ ఎ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖమ్మం మార్కెట్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



మిర్చిని పరిశీలిస్తున్న మధుసూదన్, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను శనివారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, వ్యవసాయ, ఉద్యాన అధికారులు సందర్శించారు. శనివారం మిర్చి, పత్తి కొనుగోళ్లకు వారాంతపు సెలవు కాగా, శుక్రవారం మిగిలిపోయిన మిర్చి బస్తాలను అధికారులు పరిశీలించారు. మిర్చి నాణ్యత, ధరలపై ఆరా తీసిన వారు ఏ ప్రామాణికంగా ధర నిర్ణయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే, మిర్చి నాణ్యతను నిర్ధారించే యంత్రాన్ని పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ఎం.ఏ.అలీం, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఉద్యాన శాఖ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై కేసు నమోదు

రఘునాథపాలెం: రఘునాథపాలెం పంచాయతీ ఉపసర్పంచ్ కుందే సాహెబ్‌పై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పర్సా రమేష్ శనివారం నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా అదే దారిలో ఉన్న ఉపసర్పంచ్ ఇంటి వద్ద సైకిల్ అడ్డుగా పెట్టారు. దీనిని ప్రశ్నించినందుకు ఉపసర్పంచ్ అసభ్యకరంగా దూషించడమే కాక దాడి చేశాడని రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.12,448

జిల్లా ఓటర్లు 12,16,832

- ముసాయిదా జాబితా విడుదల
- ఈ నెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణ
- వచ్చేనెల 8న తుది జాబితా ప్రచురణ



ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 12,16,831 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 5,88,739, మహిళలు 6,28,010, ఇతరులు 83 మంది ఉన్నారని తెలిపారు. అలాగే, సర్వీస్ ఓటర్లు 681 మంది ఉన్నారని పేర్కొన్నారు.

అభ్యంతరాలకు ఆహ్వానం


ఓటర్ల ముసాయిదా జాబితా ఆధారంగా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అలాగే, పేర్ల తొలగింపు, తప్పొప్పులను సరిచేసుకునేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఉంటాయని, అక్కడ ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు అందే అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులను ఫిబ్రవరి 2వ తేదీలోపు విచారించి అదేనెల 8వ తేదీన ఓటరు తుది జాబితా ప్రచురిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా, కొత్త ఓటరుగా దరఖాస్తుకు ఫాం–6, పేర్ల తొలగింపునకు ఫాం–7, చిరునామా మార్పుకోసం ఫాం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జాబితా రూపకల్పనకు సహకరించండి

జిల్లాలో మెరుగైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో ముసాయిదా జాబితా విడుదల చేశాక ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, మార్పులు, చేర్పులపై అభ్యంతరాల పరిశీలనకు సహకరించాలని తెలిపారు.

ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,55,015	1,68,064	49	3,23,128
పాలేరు	1,14,025	1,12,405	06	2,36,436
మధిర	1,07,264	1,14,444	09	2,21,717
వైరా	93,628	98,786	07	1,92,421
సత్తుపల్లి	1,18,807	1,24,311	12	2,43,130
మొత్తం	5,88,739	6,28,010	83	12,16,832





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు

- 10 మందికి పైగా విద్యార్థులకు గాయాలు
- డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ నడపడమే కారణం



ఘటనాస్థలిలో బస్సు, టిప్పర్

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో 10 మందికి పైగా విద్యార్థులు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రఘునాథపాలెం సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. రోజులాగే శనివారం విద్యార్థులతో వెళ్తున్న బస్సు ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థులు గాయాలతో బయటపడగా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విద్యార్థులు ఆందోళనకు గురికాగా, సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు చేరుకుని వివరాలు ఆరా తీశారు. అయితే, బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఘటన జరగగానే డ్రైవర్ అక్కడి నుంచి పారిపోగా తమ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని సీఐ తెలిపారు. రహదారిపై కుడివైపునకు దూసుకు వచ్చిన బస్సును చూసి టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో వాహనాన్ని పక్కకి తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కాగా, స్కూల్ బస్సు టిప్పర్‌తో పాటు రహదారి పక్కన నిలిపి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి.

అడవులను పరిరక్షించండి..

జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ



కేక్ కట్ చేస్తున్న డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిటౌన్: వన సంపదను పెంచి అడవులను పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సూచించారు. సత్తుపల్లిలోని సింగరేణి సేఫ్టీ జోన్ ఏరియాలో మొక్కలు పెంపకాన్ని సింగరేణి అధికారులతో కలిసి శనివారం ఆయన తనిఖీ చేశారు. సేఫ్టీజోన్ ఏరియాలో తప్పనిసరిగా మొక్కలు పెంచాలని సూచించిన ఆయన ఎప్పటికప్పుడు నివేదికను పీసీసీఎఫ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్నామని తెలిపారు. అనంతరం భవన్నపాలెం వాచ్‌టవర్, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన నీటి గుంటలు, సోలార్ బోర్లు, లైట్లను పరిశీలించారు. అలాగే, కుటుంబ సభ్యులతో కలిసి అర్బన్‌పార్క్‌ను సందర్శించిన ఆయన అటవీశాఖ గెస్ట్‌హౌస్‌లో కొత్త సంవత్సరం కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, ఎఫ్ఆర్ఓ పిల్లి స్నేహలత, ఎఫ్ఎస్ఓ టి.నర్సింహా, ఎఫ్‌డీఓ ముక్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

- వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించడంతో ఆగ్రహం
- పదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్న నిందితుడు



ఆదిలక్ష్మి, వీరన్న (ఫైల్)

రఘునాథపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. ఆపై కొన్నాళ్లు దాంపత్య జీవనం సజావుగా సాగింది.. ఇంతలోనే ఆయన జీవితంలోకి మరో మహిళ ప్రవేశించింది.. ఈ వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యను అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశాడు. రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పూసుపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (26)ని శివాయిగూడెంనకు చెందిన టిప్పర్ డ్రైవర్ మూడ్ వీరన్న పదేళ్ల కిందట ప్రేమించాడు. బంధువులే కావడంతో ఇరు కుటుంబాలు ఒప్పుకొని వివాహం జరిపించారు. కొన్నాళ్లు సజావుగా కాపురం సాగగా వీరికి ముగ్గురు పిల్లలు జన్మించారు. కొంతకాలంగా వీరన్న అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతూ మూడు నెలల కిందట ఆమెతో వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు తిరిగి రావడంతో పెద్దలు పంచాయితీ నిర్వహించగా ఇక నుంచి ఆదిలక్ష్మితోనే ఉంటానని నమ్మబలికిన వీరన్న ఆమెను పుట్టింటి నుంచి తీసుకొచ్చాడు. కానీ కొద్దిరోజులకే పరిస్థితి మొదటికి రాగా భార్యను అనుమానించడం మొదలుపెట్టాడు. ఎవరితో ఫోన్ మాట్లాడినా అనుమానించడంతో వీరన్న – ఆదిలక్ష్మి నడుమ ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం కూడా మొదలైన గొడవ పెద్దది కావడంతో ఆదిలక్ష్మిని ఆయన గొడ్డలితో దారుణంగా నరికి హత్యచేశాక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో ఖమ్మం ఏసీపీ హరికృష్ణ, రఘునాథపాలెం సీఐ శ్రీధర్ ఘటనాస్థలికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు: మండలంలోని కందుకూరు – దుద్దెపూడి మధ్య తుంగావారి కాలనీ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం తుంబూరు కు చెందిన షేక్ జహీర్‌బాషా(37) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కాగా, తుంగావారి కాలనీ సమీపాన శనివారం ఆయన తలకు బలమైన గాయంతో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. ఇంతలోనే ఆయన ఫోన్‌కు కాల్ రావడంతో సమాచారం ఇవ్వగా కుటుంబీకులు చేరుకుని పోలీసులకు తెలపగా వారు వచ్చి పరిశీలించే సరికి మృతి చెంది ఉన్నాడు. కాగా, జహీర్ తుంబూరు సొసైటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రహదారిపై వెళ్తుండగా ఏదైనా వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమా దం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పుట్టకోట క్రాస్ రోడ్డు వద్ద గుట్టపై నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు నీళ్లు పడుతున్న కార్మికుడు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడుకు చెందిన పోలపోగు వెంకన్న తన కుమారుడు, భార్యతో కలిసి ఒక నిర్మాణ సంస్థ భవన సముదాయం వద్ద రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే శనివారం మూడో అంతస్తులో క్యూరింగ్ కోసం నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ప్రయాణికుడు..

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఘటన



రాంబాబు (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్: భార్యాపిల్లలతో కలిసి ప్రయాణానికి సిద్ధమైన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామానికి చెందిన వంగూరి రాంబాబు (30) తన భార్య నవ్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేందుకు టికెట్ తీసుకున్నాక పుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి రెండో ప్లాట్‌ఫామ్‌కు బయలుదేరాడు. మధ్యలోనే ఆయన గుండెపోటుతో కుప్పకూలగా, రాంబాబు భార్య నవ్య స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా రోదించారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెం చెరువులో గల్లంతైన మత్స్యకారుల సంఘం సొసైటీ సభ్యుడు పిట్టల కనకయ్య(40) మృతదేహం లభించింది. చెరువులో చేపల కాపలా కోసం పలువురితో కలిసి గురువారం రాత్రి వెళ్లిన కనకయ్య పడవపై గస్తీ కాస్తున్నారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతు కాగా, శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మృతదేహం బయటపడింది. ఈమేరకు ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

పేదరిక నిర్మూలన పథకాల అమలుకు సహకరించాలి

ఖమ్మం లీగల్: సమాజంలోని పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం అమలుచేసే పథకాలు అర్హులకు అందేలా పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలో శనివారం జరిగిన వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పిల్లలు నిరాదరణకు గురై భిక్షాటన చేస్తే ప్రీ లిటిగేషన్ విధానంలో కేసులు దాఖలు చేసి పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. అలాగే, మహిళలందరికీ ఉచిత న్యాయ సాయం అందుతున్న అంశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, రాజీమార్గంపై అవగాహన కల్పించి ఇటీవల జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేసిన వలంటీర్లను ఆయన అభినందించారు.

ఫారెస్టు ప్లాంటేషన్ ధ్వంసంపై విచారణ

కారేపల్లి: కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధి ఎర్రబోడు సమీపాన ఊటవాగు వద్ద వేసిన ఫారెస్టు ప్లాంటేషన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నరికివేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కారేపల్లి అటవీ సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా కొన్నాళ్ల కిందట ఊటవాగు వద్ద సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కొందరు పోడు వ్యవసాయం చేస్తుండగా.. అటవీ అధికారులు అడ్డుకుని ప్లాంటేషన్ వేశారు. దీంతో కొందరు పోడురైతులు ఫారెస్టు అధికారులు నాటిన మొక్కలను ధ్వంసం చేయగా అప్పట్లో కేసులు నమోదయ్యాయి. మళ్లీ ఊటవాగు ప్రాంతంలోనే ప్లాంటేషన్‌ను ధ్వంసం చేయటంతో సదరు పోడు రైతులను విచారిస్తున్నట్లు తెలిసింది.

స్తంభాద్రి ఆలయంలో వైభవంగా పుష్పయాగం



స్వామి వారికి పూలు సమర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్ దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా శనివారం రాత్రి ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహించారు. తీరొక్క పూలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్ దంపతులు పాల్గొని పుష్పాలను సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావుతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఖమ్మంసహకారనగర్: వచ్చే నెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరగనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించి విజయవంతం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని, కులానికో గురుకులం తెరిచి విద్యార్థుల మధ్య అంతరం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో విద్యావ్యవస్థకు సరైన నిధులు కేటాయించలేదని, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోగా, ఉపాధ్యాయ పోస్టుల భర్తీలోనూ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏపీ నాగేశ్వరరావు, ఎస్.విజయ్‌తో పాటు వి.మనోహర్‌రాజ్, ముత్తయ్య, ప్రసాదరావు, వై.పద్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే పట్టు పరిశ్రమతో లాభాలు

ఖమ్మంవ్యవసాయం: తగిన మెళకువలు పాటిస్తే పట్టు పరిశ్రమతో లాభాలు సమకూరుతాయని సంస్థ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ జి.అనసూయ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పట్టు పరిశ్రమ రైతులకు ఖమ్మంలోని కలెక్టరేట్‌లో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో, తక్కువ కాలంలోనే పట్టు పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం పట్టు గూళ్ల ధరలు కూడా మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. ఈమేరకు రైతులు మల్బరీ తోటల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పాదుకా మహోత్సవం



మాట్లాడుతున్న దేవనాథ్ జీయర్ స్వామి

సత్తుపల్లి శ్రీగీతాజ్ఞాన మందిరంలోని శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో శనివారం త్రిదండి దేవనాథ్ జీయర్‌స్వామి ఆధ్వర్యాన శ్రీరామ పాదుకా మహోత్సవం నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ధనుర్మాస విశిష్టతను స్వామి వివరించారు. తొలుత పట్టణంలో శ్రీరామ పాదుకలతో శోభాయాత్ర నిర్వహించారు. అర్చకులు ఏవీ కృష్ణచైతన్య, గుడివాడ వెంకటేశ్వరరావు, ఏపూరి పురుషోత్తం, పి.వెంకటేశ్వరరావు, కొనకళ్ల శంకర్‌రావు, బాల లీలా కృష్ణ, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

– సత్తుపల్లిటౌన్

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్(పై చిత్రం), తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ శనివారం దర్శించుకున్నారు.



దరిగాం అడవుల్లో పులి హతం?

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్ నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో శనివారం పులి హతమైనట్లు తెలిసింది. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతిచెందినట్లు తెలిసింది. దరిగాం అటవీ ప్రాంతం దట్టంగానూ, ఆవాసానికి అనుకూలంగానూ ఉండడంతో ఇక్కడ పులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే పోటీ తత్వంతో రెండు పులుల మధ్య ఘర్షణ జరిగినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు వెల్లడించే విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు.

పొద్దుపొద్దునే ప్రయాణాలొద్దు!

➤ మొదటి పేజీ తరువాయి

పోలీసులు తెలిపారు.

➤ 25 డిసెంబర్, 2023న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడు వద్ద రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 ఏండ్ల యువకుడు రమావత్ శివనాయక్ ద్విచక్రవాహనంతో 55 ఏండ్ల బల్లూరి సైదులు అనే వ్యక్తిని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మృతుడు శివనాయక్ బంధువులు టాటాఏస్ వాహనంలో ప్రమాద ఘటన స్థలానికి బయలుదేరారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ నిడమనూరు మండలం 3వ నంబర్ కెనాల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. దట్టమైన పొగమంచు కారణంగానే ఈ వరుస ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు.

➤ డిసెంబర్ 31న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చనిపోగా, ఆర్టీసీ బస్ డ్రైవర్‌తోపాటు ఆ బస్సులోని మరో 10మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పొగమంచుతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్టు తెలిపారు.

➤ డిసెంబర్ 25న హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా అనంతగిరి ఔటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న మిత్రుల బృందం కారు పొగమంచు కారణంగా రోడ్డు పక్కన ఉన్న శివారెడ్డిపేట్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఒకరు గల్లంతు కాగా, మిగిలిన నలుగురిని స్థానికులు కాపాడారు.

ప్రయాణం తప్పనిసరైతే ఇవి మరవొద్దు

➤ పొగమంచు కురుస్తున్నప్పుడు మీకు కేటాయించిన లేన్‌లోనే వాహనం నడపాలి. వీలైనంత వరకు ఓవర్‌టేక్ చేయకపోవడమే ఉత్తమం.

➤ సింగిల్ రోడ్డులో వాహనం నడపాల్సి వస్తే.. వీలైనంత వరకు మీ వాహనం ఎడమవైపు ఉండేలా చూసుకోవాలి.

➤ డ్రైవింగ్ సమయంలో ఏ సంశయం ఉన్నా.. రోడ్డు పూర్తిగా కనిపించకపోయినా మీ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలపడమే ఉత్తమం. మీరు వాహనాన్ని పార్క్ చేసినట్టుగా సూచిస్తూ పార్కింగ్ లైట్లు వేయాలి.

➤ పొగమంచు వాతావరణం ఉన్నప్పుడు వాహన వేగాన్ని వీలైనంత వరకు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎదుటి వాహనం కనిపించని పరిస్థితుల్లో వేగంగా వెళితే వాహనాన్ని కంట్రోల్ చేయడం కష్టం. అదేవిధంగా ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.

➤ పొగమంచు కురుస్తున్నప్పుడు డ్రైవర్లు సాధారణంగా హైబీంలో లైట్లు పెడతారు. ఇలా చేయడం వల్ల రిఫ్లెక్షన్ వల్ల డ్రైవర్‌కు సరిగా కనిపించదు. విజిబిలిటి 100 మీటర్లలోపు ఉన్నట్లయితే హెడ్‌లైట్లు లోబీంలో ఉంచాలి. మీ వాహనానికి ఫాగ్ ల్యాంప్‌లు ఉంటే వాటిని తప్పక ఆన్ చేయాలి.

➤ ఎదుటి వాహనదారుడిని అప్రమత్తం చేసేలా మీ వాహనానికి ఇండికేటర్లు వేసు కుని వెళ్లడం ఉత్తమం.

➤ మీ వాహన అద్దాలు వీలైనంత వరకు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మీ కారులోని డీఫాగర్‌ను ఆన్ చేసుకోవాలి.

➤ వీలైనంత వరకు ఎదురుగా ఉన్న రోడ్డు స్పష్టంగా కనిపించేలా అవసరం మేరకు డ్రైవింగ్ సీట్‌ను సర్దుబాటు చేసుకోవాలి.

➤ పొగమంచు ఉన్నప్పుడు వాహనం ఒక్క క్షణం అదుపు తప్పి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి డ్రైవింగ్‌పైనే దృష్టి పెట్టాలి. నిద్రమత్తు లేకుండా జాగ్రత్త పడాలి.

➤ వాహనం పూర్తి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. టైర్లు, బ్రేక్‌లు ముందుగానే చెక్ చేసుకోవాలి. మీ కారులోని హీటర్ ఆన్ చేయాలి. దీనివల్ల బయటి పొగమంచుతో అద్దంపై ప్రభావం లేకుండా ఉంటుంది.

➤ లేన్ మారుతున్నప్పుడు, మూల మలుపుల వద్ద తప్పకుండా హారన్ మోగించాలి.

➤ మొబైల్ ఫోన్ వాడడం, రేడియోలో ఎఫ్ఎం వినడం, పాటలు వింటూ డ్రైవ్ చేయవద్దు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరడం వెనుక చంద్రబాబు కుట్ర

- అధికారం ఇక కలే అని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- దింపుడుకళ్లం ఆశలతో రకరకాల కుట్రలు
- సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు
- ఉనికిలోలేని కాంగ్రెస్‌లో ఎవరు చేరినా మాకేమీ నష్టం లేదు
- వైఎస్సార్‌సీపీని ఆదిలోనే తుంచేయడానికి కాంగ్రెస్, టీడీపీ కుట్ర
- అప్పుడే ఏం చేయలేని వారు.. ఇప్పుడేం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: కాంగ్రెస్‌లో షర్మిలమ్మ చేరడం వెనుక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇక అధికారం కలే అని గ్రహించిన చంద్రబాబు.. దింపుడుకళ్లం ఆశలతో ఈ కుట్రకు పాల్పడ్డారని మండిపడ్డారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను చేతిలో పెట్టుకున్న చంద్రబాబు.. తన మనుషుల ద్వారా ఒక వైపు కాంగ్రెస్‌ను.. మరో వైపు బీజేపీని మేనేజ్ చేస్తున్నారని, మీడియా ద్వారా ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మంచి ఏమీ లేకపోవడంతో ఇప్పుడేమీ చెప్పుకోలేక ఇప్పుడు రకరకాల కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆ కుట్రలో భాగంగానే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరికన్నారు. షర్మిలమ్మ సీఎం రమేశ్ విమానంలో వెళ్లడం.. టీడీపీ నేత బీటెక్ రవిని బ్రదర్ అనిల్ కలవడం యాదృశ్చికమని తాము అనుకోవడం లేదన్నారు. క్రిస్టియన్ ఓట్లను ప్రభావితం చేయడానికి కుట్రలు చేస్తున్నారంటూ గతంలో ఇదే టీడీపీ నేతలు బ్రదర్ అనిల్‌పై ఏ స్థాయిలో దుమ్మెత్తిపోశారో అందరికీ గుర్తుందన్నారు. టీడీపీ నేత బీటెక్ రవిని ఎయిర్‌పోర్ట్‌లో బ్రదర్ అనిల్ మర్యాదపూర్వకంగా కలవడం వంటి వాటన్నింటినీ పరిశీలిస్తే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరడం వెనుక చంద్రబాబు కుట్ర ఉందన్నది అర్థమవుతోందన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా నష్టం లేదు..

రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి, పార్టీ పెట్టి, తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా ఆపార్టీలో చేరడం షర్మిలమ్మ ఇష్టమని సజ్జల అన్నారు. అండమాన్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ఎక్కడైనా పనిచేస్తానని ఆమె అన్నారని, రాష్ట్రంలోనే రాజకీయం చేస్తానని ప్రకటించలేదన్నారు. ఒకవేళ రాష్ట్రానికి వస్తే కాంగ్రెస్ నాయకురాలిగానే తాము చూస్తామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని.. అలాంటి పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదన్నారు. రాష్ట్రంలో ఉనికేలేని కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరినా తమకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు.

అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ కలసి కుట్ర..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై కాంగ్రెస్‌కు సంబంధించి తమకు అనుమానాలు ఉన్నాయని సజ్జల పునరుద్ఘాటించారు. వైఎస్ మరణం తర్వాత అప్పట్లో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం టీడీపీ కుమ్మక్కై జగన్‌పై తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీని స్థాపించాక కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను, వైఎస్ విజయమ్మను ఓడించటం ద్వారా పార్టీని మొగ్గలోనే తుంచేయడానికి అప్పటి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష టీడీపీ కుమ్మక్కై కుట్ర చేశాయన్నారు. పులివెందుల ఉపఎన్నికలో వైఎస్ విజయమ్మపై వైఎస్ వివేకాను పోటీకి పెట్టారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్ విజయమ్మ 80 శాతం ఓట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. కడప లోక్‌సభ స్థానం నుంచి జగన్ రికార్డు మెజార్టీతో విజయం సాధించారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వైఎస్సార్‌సీపీపై కుట్ర చేసి బొక్కబోర్లా పడ్డ చంద్రబాబు, కాంగ్రెస్ ఇప్పుడు ఏమీ చేయలేరని స్పష్టం చేశారు.

ఆది నుంచి కాంగ్రెస్‌తోనే చంద్రబాబు..

మహానేత వైఎస్ మరణించినప్పటి నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెరవెనుక కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారని సజ్జల ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని.. ఆ కుట్రలో భాగంగానే షర్మిల చేరికని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో జరగబోయే డ్రామా అంతా చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరగనుందన్నారు. ప్రజా సమస్యలపై కాకుండా.. ప్రజలకు సంబంధం లేని సంచలనాలు సృష్టించడమే చంద్రబాబు నైజమన్నారు.

అభ్యర్థుల మార్పు సహజమే..

ఎన్నికల్లో అభ్యర్థుల మార్పుపై అన్ని పార్టీల్లోనూ సహజ ప్రక్రియేనని సజ్జల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమన్వయకర్తలను మారుస్తున్నారని చెప్పారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని.. అందరితో చర్చించే అవసరమైన చోట్ల సమన్వయకర్తలను మార్చు తున్నామని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని.. వ్యక్తిగత కారణాలతోనే కొందరు పార్టీని వీడుతున్నారని స్పష్టం చేశారు.

టీడీపీని వదిలేస్తున్నా..

విజయవాడ ఎంపీ కేశినేని నాని



- దొంగే.. దొంగ.. దొంగ.. అన్నట్లుగా చంద్రబాబు తీరు
- ఆ పార్టీకి ఎంతో సేవ చేశా.. నన్ను పొమ్మంటున్నారు
- ఆ పార్టీలో కొనసాగడంలో అర్థం లేదు
- ఇతర పార్టీల నేతలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పా?
- ముందుగా ఎంపీ పదవికి రాజీనామా.. ఆ తరువాత టీడీపీకి రాజీనామా
- అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'దొంగే.. దొంగ.. దొంగ..' అన్నట్లుగా ఉంది చంద్రబాబు తీరు. ఇక తెలుగుదేశం పార్టీలో ఉండను. ఆ పార్టీని వదిలేస్తున్నా' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) సంచలన ప్రకటన చేశారు. రెండుసార్లు ఎంపీగా చేసి, పార్టీకి ఎంతో సేవ చేసిన తనను చంద్రబాబు పొమ్మన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నాననే సాకుతో తనను పార్టీ నుంచి దూరంగా పెట్టారని వాపోయారు. ఎంపీ నాని శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాని మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాను కొనసాగిన టీడీపీని వదిలేస్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ''నేను టీడీపీని వదిలేస్తున్నా. ఆ పార్టీకి నా అవసరం లేనప్పుడు.. నేను అందులో కొనసాగడంలో అర్థం లేదు. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నా. ముందుగా ఢిల్లీ వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా లెటర్ స్పీకర్‌కు ఇచ్చి, ఆమోదింపజేయించుకుని వస్తా. ఆ వెంటనే తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తా' అని చెప్పారు. ప్రజా అభివృద్ధి పనుల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీని కలుసుకున్న వైనాన్ని ఉదహరిస్తూ.. 'ప్రధానిని కలుసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నాయకుడు అయిపోతాడా? ఒక పార్టీ నాయకులు మరో పార్టీ నాయకులతో కలిసి పర్యటించకూడదని రాజ్యాంగంలో రాసుందా?' అంటూ బాబును ప్రశ్నించారు.

పార్టీ మార్పు నిర్ణయాధికారం అభిమానులదే

భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ, ఏ పార్టీలోకి వెళ్లాలో తన అభిమానులకే వదిలేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తనకు అభిమానులున్నారని, తనపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని అన్నారు. ఎంపీ పదవితో రాజకీయాలను వదిలేసి విశ్రాంతి తీసుకుందామనుకున్న తన తన నిర్ణయాన్ని అభిమానులు వ్యతిరేకించారన్నారు. ముందుగా టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తానని చెప్పారు. అభిమానులు ఏ పార్టీకి జై కొడితే అదే పార్టీలో చేరతానని స్పష్టం చేశారు.

ఈనాడు వార్తలు సరైనవి కావు

రాజకీయాలంటే త్యాగమని ఎంపీ నాని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నానని ఇటీవల ఈనాడు పత్రికలో రాశారని, అలాంటి వార్తలు సరైనవి కావని అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రోడ్డు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చానని, ఎమ్మెల్యేతో కలిసి పాల్గొంటే తప్పేమిటని అన్నారు. ఎవరితో కలిసి పాల్గొనాలో ఈనాడే నిర్ణయిస్తుందా అని ప్రశ్నించారు.

రామయ్యను దర్శించుకున్న సినీనటులు



పంచవటీ కుటీరంలో నటులు

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని సినీ, టీవీ నటులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోనీసింగ్, జస్వంత్ పడాల జెస్సీ, సిద్ధురాం, సాయిరాం తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టత తెలుసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టండి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్



మాట్లాడుతున్న నామాల ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా, వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ భావజాలాన్ని చొప్పించి, అశాస్త్రీయ భావజాలంతో కూడిన మత చాందస భావాలతో కూడిన పాఠ్యాంశాలను పొందుపర్చడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు కేటాయించకుండా యూనివర్సిటీ గ్రాంట్స్ విడుదల చేయకుండా విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆవుల అశోక్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నీరుగార్చేందుకు భారత న్యాయ చట్టాల పేరుతో మనువాద భావజాలాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ మేరకు పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ అమరవీరులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, నాయకులు ఝాన్సీ, దీపిక, నవీన్, కిరణ్, లక్ష్మణ్, కరుణ్, శ్రీకాంత్, శశి, చంద్రశేఖర్, శ్రీకాంత్, గురు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా తీర్చిదిద్దాలి..



భద్రాచలం ఐటీడీఏ విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు
- ఓవరాల్ చాంపియన్‌గా ఉట్నూరు, రెండో స్థానంలో భద్రాచలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు, వేదికపై పీఓ ప్రతీక్ తదితరులు

పాల్వంచరూరల్: గిరిజన విద్యార్థులకు సరైన రీతిలో శిక్షణ ఇస్తే దేశం గర్వించతగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దొచ్చని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ గిరిజన విద్యార్థులు సహజంగానే దృఢంగా ఉంటారని, వీరికి సరైన రీతిలో శిక్షణ ఇస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తారని తెలిపారు. అయితే, విద్యార్థులు చదువుకుంటూ క్రీడల్లో తర్ఫీదు పొందాలని.. తద్వారా ఉన్నతమైన భవిష్యత్ సొంతమవుతుందని చెప్పారు. పీఓ ప్రతీక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువు, క్రీడల్లో ప్రతిభ చాటి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని ఆకాంక్షించారు. తన మాదిరి ఐఏఎస్ సాధించి ఐటీడీఏలో పీఓ సీట్‌లో కూర్చున్న నాడు చాలా సంతోషిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏపీఓ డేవిడ్‌రాజు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జ్యోతి, వివిధ జిల్లాల అధికారులు బి.గోపాల్‌రావు, బి.రమేష్, మీనారెడ్డి, కిష్టు, జి.చందన్, ఎస్.చంద్రమోహన్, కె.జహీరుద్దీన్, పి.నర్సింహారావు, బి.రూపాదేవి, టి.రమణయ్య, నాగేశ్వరరావు, చందు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌గా ఉట్నూరు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఇక రెండో స్థానాన్ని భద్రాచలం ఐటీడీఏ పరిధి విద్యార్థులు దక్కించుకున్నారు. వాలీబాల్ బాలికల విభాగంలో భద్రాచలం, ఉట్నూరు, బాలుర విభాగంలో భద్రాచలం, ఉట్నూరు, ఖోఖోలో ఉట్నూరు-2, ఏటూరు నాగారం మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అలాగే, టెన్నికాయిట్, చదరంగం, ఆర్చరీ పోటీల్లో విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

క్రీడాకారుడిగా పీఓ..

నిత్యం విధినిర్వహణలో బిజీగా గడిపే భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ కాసేపు క్రీడాకారుడిగా మారిపోయారు. కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల ముగింపు సమావేశానికి హాజరైన విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు.



వాలీబాల్ ఆడుతున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్

ఇది మైదానమా?



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ, పట్టణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయించింది. అయితే, ప్రభుత్వ స్థలాలు లేక అధికారులు హడావుడిగా ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో క్రీడాకారులకు ఉపయోగపడటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం నడిమిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం గుంతలు, రాళ్లతో కూడి ఉండటంతో పేరుకు మాత్రమే ఆటస్థలంగా మిగిలిపోయింది. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

ఆటోలో నెదర్లాండ్స్ వాసుల దేశాటన

టేకులపల్లి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులైన నెదర్లాండ్స్‌కు చెందిన ఓ కుటుంబం ఆటోలో దేశపర్యటన చేస్తోంది. నెదర్లాండ్స్ దేశానికి చెందిన ఫిన్, క్రే, బెన్ని, టైమ్, జిన్ ఐదుగురు సభ్యులు కలిగిన కుటుంబీకులు భారత్ వచ్చారు. కేరళలో పర్యటించిన అనంతరం రెండు ఆటోలు తీసుకుని దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌కు వెళ్తున్న వారు శనివారం ఉదయం టేకులపల్లిలో టిఫిన్ కోసం ఆగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలే కాక ఇక్కడి వంటకాలు, భిన్నత్వంలో ఏకత్వం కనబరిచే ప్రజలు చాలా నచ్చారని తెలిపారు.



టేకులపల్లిలో టిఫిన్ చేస్తున్న నెదర్లాండ్స్ దేశస్థులు

రైల్వే అధికారుల అలసత్వం

సమాచారం ఇవ్వకుండానే గేట్ మూసివేత



రైల్వే గేట్ వద్ద నిలిచిన వాహనాలు

కారేపల్లి: రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కారేపల్లి – పేరుపల్లి రైల్వే గేట్‌ను మరమ్మతుల దృష్ట్యా అధికారులు మూడు రోజులుగా మూసివేశారు. దీంతో మాధారం, పేరుపల్లి, రావోజీతండా, మల్లన్నగూడెం, జమాళ్లపల్లి, గుంపెళ్లగూడెం, కొత్తతండా, కట్టుగూడెం గ్రామాల ప్రజలు, వాహనదారులు కారేపల్లికి రావాలన్నా, ఖమ్మం వెళ్లాలన్నా.. సూర్యతండా, అప్పాయిగూడెం మీదుగా ఇల్లెందు – కారేపల్లి రైల్వే గేట్ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇంతలోనే ముందస్తు సమాచారం ఇవ్వకుండా ట్రాక్ మరమ్మతుల పేరిట శనివారం ఇల్లెందు – కారేపల్లి రైల్వే గేట్ సైతం మూసేశారు. దీంతో వాహనదారులు ఎటునుంచి వెళ్లాలో తెలియక గంటపాటు పడిగాపులు కాశారు. ఈ ఇల్లెందు గేట్ వద్ద ఉన్న రైల్వే అధికారులను నిలదీశారు. వాహనాదారుల ఇక్కట్లు పట్టించుకోకుండా గేట్ మూసివేయటం ఏమిటని ప్రశ్నించారు. చివరకు పనులు పూర్తయ్యాక గేట్ తీయడంతో రాకపోకలు మొదలయ్యాయి.

ఫుట్‌బాల్‌లో 'సీ' కేటగిరీ శిక్షణ పూర్తి



కె.ఆదర్శ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల పశ్చిమబెంగాల్ రాష్ట్ర గంగాధర్‌పూర్‌లో నిర్వహించిన 'సీ' కేటగిరీ శిక్షణను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ పూర్తిచేశారు. జిల్లా నుంచి ఆయన మాత్రమే శిబిరానికి ఎంపిక కాగా, శిక్షణ పూర్తవడంతో జాతీయస్థాయి జూనియర్ కేటగిరీ జట్ల సెలక్టర్‌గా అవకాశం దక్కనుంది. ఈసందర్భంగా ఆదర్శ్‌ను కలెక్టర్ వీ.పీ. గౌతమ్, డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ టి.సునీల్ రెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సెల్యూకాస్ అభినందించారు.

హోరాహోరీగా నెహ్రూ కప్

నేడు ఖమ్మం – భద్రాచలం మధ్య ఫైనల్స్

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వారం రోజులుగా జరుగుతున్న నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు తుది దశకు చేరాయి. శనివారం జరిగిన సెమీస్‌లో చందు లెవెన్ భద్రాచలం జట్టుపై మాస్టర్స్ లెవెన్ ఖమ్మం జట్టు ఘన విజయం సాధించింది. మరో సెమీస్ బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం, వైఎంసీసీ ఇల్లెందు జట్ల మధ్య జరగగా భద్రాచలం జట్టు గెలుపొందింది. దీంతో ఆదివారం జరిగే ఫైనల్స్‌లో మాస్టర్స్ లెవెన్ ఖమ్మం-బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం జట్లు తలపడనున్నాయి. కాగా, శనివారం మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మితోపాటు పాకాలపాటి దుర్గాప్రసాద్, బాలయోగి, నాగార్జున, సలీమ్, సదానందం, అజీమ్, శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, తిరుమలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు